'డబుల్' ఇళ్లు ఎప్పుడిస్తరు?

- నిర్మాణం పూర్తయినా పంపిణీకి నోచుకోని వైనం
- శిథిలావస్థకు చేరుకుంటున్న రెండు పడకగదుల ఇళ్లు
- ఎదురుచూపుల్లో లబ్ధిదారులు


ఉట్నూర్‌లో ఇళ్లచుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు


ఇంద్రవెల్లిలో అసంపూర్తిగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు

ఉట్నూర్‌రూరల్: నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఖానాపూర్ నియోజకవర్గానికి మొత్తం 715 ఇళ్లు మంజూరుచేసి నిర్మాణ పనులు ప్రారంభించింది. ఒక్కో ఇంటికి దాదాపు రూ.5 లక్షల 4 వేలు వెచ్చించింది. పలుచోట్ల ఇళ్ల నిర్మాణాలు పూర్తయినప్పటికీ అర్హులను ఎంపిక చేసే సమయానికి అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. దీంతో పంపిణీ ప్రక్రియ అక్కడే నిలిచిపోయింది. ఇప్పటికీ లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ చేయకపోవడంతో ప్రస్తుతం ఇళ్లచుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఇళ్లులేని నిరుపేదలు డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఎప్పుడు పంపిణీ చేస్తారోనని ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు దృష్టి సారించి అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు నిర్మాణాలు పూర్తయిన చోట అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

వివిధ మండలాల్లో ఇలా..

ఖానాపూర్ మండల కేంద్రంలో 400 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి నిరుపేదలకు పంపిణీ చేశారు. కానీ ప్రస్తుతం అందులో కొంతమంది అనర్హులు నివాసం ఉంటున్నారని స్థానికులు పలు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. అదే విధంగా జన్నారం మండలంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం లేక స్థల పరిశీలనలోనే నిర్మాణాలు నిలిచిపోయాయి. కడెం మండల కేంద్రంలో 200 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినప్పటికీ పంపిణీ నిలిచి పోయింది. ఇంద్రవెల్లి మండల కేంద్రంలో 35 ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 19 ఇళ్ల నిర్మాణం పూర్తికాగా 16 ఇళ్లు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఉట్నూర్ మండల కేంద్రంలో 80 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. లబ్ధిదారుల ఎంపికలో జాప్యం చోటు చేసుకుంది. ఈక్రమంలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పంపిణీ నిలిచి పోయింది. దీంతో ఇళ్ల పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగి శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే దశకు చేరుకున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టి నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ఓజోన్ పొరను కాపాడుకోవాలి


మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ఇచ్చోడ: ఓజోన్ పొరను కాపాడుకునే బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఓ జోన్ డే సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఓజోన్ పొర ప్రాముఖ్యత, అది క్షీణించడం వలన కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. ఓ జోన్ పొరను పరిరక్షించాలంటే విరివిగా మొక్కలు నాటాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ సరస్వతి, అధ్యాపకులు మధు, అనిత, ప్రభాత్ రావు, దయాకర్, విజయకుమార్, తిరుపతి, సుభాష్, బాలకృష్ణ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: పర్యావరణాన్ని రక్షించే ఓజోన్ పొరను కాపాడుకోవాలని జిల్లా కేంద్రంలోని కోలిపుర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నయ్యర్ ఆరాజాన్ బేగం అన్నారు. ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి రవీంద్ర, మురళీ, శేఖర్, మాధవి, సంజీవ్‌రావు, భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


సుంగాపూర్‌లో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

నార్నూర్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గాదిగూడ మండలంలోని ఝరి పీహెచ్‌సీ వైద్యాధికారి సంజీవ్ నాయక్ అన్నారు. మంగళవారం నార్నూర్ మండలంలోని సుంగాపూర్‌లో ర్యాపిడ్ ఫీవర్ సర్వేతో పాటు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రజలు దగ్గు, జలుబు, జ్వరాలతో బాధపడుతున్నారన్నారు. గ్రామాల్లో శానిటేషన్, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ అడే సంజీవ్, హెచ్ఈ రాథోడ్ రవీందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

నేరడిగొండ: ఆరోగ్యంపై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పీహెచ్‌సీ హెచ్ఈఓ పవార్ రవీందర్ అన్నారు. మంగళవారం కుంటాల ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పరీక్షించి అవసరమైన వారికి మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, భోజనం చేసే ముందు, తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబారావు, హెల్త్ సూపర్‌వైజర్లు సంతోష్, బి.స్వర్ణలత, ఏఎన్ఎం జ్యోతి, జీఎన్ఎం అశ్విని, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్జీఎఫ్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో బుధవారం పలు క్రీడాంశాల్లో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆడే రామేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 14, 17 బాల, బాలికలకు జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్లో టేబుల్ టెన్నిస్, ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జూడో, రెజ్లింగ్, బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. లిటిల్ స్టార్ హైస్కూల్లో వెయిట్ లిఫ్టింగ్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో ఖోఖో, చావారా అకాడమీ పాఠశాల(మావల)లో బాస్కెట్‌బాల్ పోటీలు ఉంటాయని వెల్లడించారు. టేబుల్ టెన్నిస్ క్రీడలో పాల్గొనదలచిన క్రీడాకారులు 9440019225, 9490354175, బ్యాడ్మింటన్ క్రీడలో పాల్గొనేవారు 9440765485, 9490740567, జూడో పోటీల్లో పాల్గొనేవారు 9966684701, రెజ్లింగ్‌లో పాల్గొనేవారు 9182631632, బాస్కెట్ బాల్‌లో పాల్గొనేవారు 9908858805, ఖోఖోలో పాల్గొనేవారు 9014547319, వెయిట్ లిఫ్టింగ్‌లో పాల్గొనేవారు 9542222783 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

డైరెక్టర్‌కు సన్మానం

తాంసి: ఆదిలాబాద్ జిల్లా గొర్రెల సహకార సంఘం డైరెక్టర్‌గా ఎన్నికైన కేమ లక్ష్మణ్‌ను మంగళవారం పొన్నారి గ్రామస్తులు సన్మానించారు. సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మాజీ సర్పంచ్ అశోక్, కురుమ సంఘం నాయకులు ఆనంద్, భోజన్న యాదవ్, లక్ష్మీపతి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి..

ఇచ్చోడ: మండలంలోని ముఖరా బి ప్రాథమిక పాఠశాలలో తెలుగు పండిత్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న అరుణను మంగళవారం మాజీ సర్పంచ్ అడవ్‌మారుతి, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఇంద్రవెల్లి: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఈ.సాయన్న అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారత శిక్షాస్మృతిలోని సంబంధిత బీఎన్ఎస్ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంపీ పరామర్శ

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన వొర్సి నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులు శ్రీనివాస్, సంతోష్‌ను మంగళవారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు తాటిపల్లి రాజు, కొత్త శంకర్, నానం రమణ, జాంసింగ్, నందుకుమార్ పాల్గొన్నారు.

హిందీభాషా దినోత్సవం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. అధ్యాపకులు గణేశ్ హిందీ గొప్పతనం గురించి వివరించారు. ప్రిన్సిపాల్ ధనరాజ్, అధ్యాపకులు గణేశ్, శ్రీనివాసరావు, సువర్ణ, శ్రీలత, వినోద్ పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్రి రైతువేదికలో మంగళవారం పిప్రి, వర్తమన్నూర్, ఎల్లయ్యపల్లి, కాండ్లి, గిర్నూర్, మోహద గ్రామాల రైతులకు నానో యూరియా, నానో డీఏపీ వాడకంపై ఆప్కో ఫర్టిలైజర్ కంపెనీ ప్రతినిధి అరవింద్ అవగాహన కల్పించారు.ఏఈవో కృష్ణపాల్, రైతులు పాల్గొన్నారు.

పైలట్ ప్రజావాణి

బోథ్: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం పైలట్ ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

మేక గుండెతో వినూత్న బోధన


గుండె, కిడ్నీ పరిశీలిస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మామిడిగూడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఆ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు కే.సునీత మంగళవారం మేక గుండె, కిడ్నీని తీసుకెళ్లి వినూత్నంగా బోధన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ల్యాబ్ యాక్టివిటీస్‌లో భాగంగా విద్యార్థులకు మేక గుండె, కిడ్నీతో ప్రత్యక్ష బోధన చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు వాటిని ప్రత్యక్షంగా చూడడం ద్వారా వారిలో ఎప్పటికీ గుర్తుండి పోతుందన్నారు.

ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు దరఖాస్తులు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో ఏర్పాటు చేయనున్న ప్రీప్రైమరీ పాఠశాలలో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. రణదీవెనగర్ ప్రీప్రైమరీకి కేటాయించిన పోస్టును ఇక్కడికి మార్చినట్లు పేర్కొన్నారు. ఆ పాఠశాలలో సరైన గదులు లేకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు కేఆర్‌కేకు మార్చినట్లు వివరించారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు అభ్యర్థులు ఇంటర్, ఆయా పోస్టుకు ఏడోతరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. 18 నుంచి 44 సంవత్సరాల లోపు వారు దరఖాస్తులను ఈనెల 19లోగా కేఆర్‌కేలోని ప్రాథమిక పాఠశాలలో అందజేయాలని సూచించారు.


పశువులను తరలిస్తున్న ఒకరి అరెస్టు

బోథ్: పశువులను అక్రమంగా తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీసాయి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం రవ్వజియ డ్రైవర్ జావీద్‌తో కలిసి నాగ్‌పూర్‌లో కొనుగోలు చేసిన 33 ఎద్దులను శంషాబాద్‌లోని కబేళాకు తరలిస్తుండగా సొనాల మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. రవ్వజియను అరెస్టు చేయగా డ్రైవర్ పరారీలో ఉన్నాడని ఎస్సై తెలిపారు.

రేపు వ్యాసరచన పోటీలు

కైలాస్‌నగర్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (పర్యాటకశాఖ) ఆధ్వర్యంలో ఈ నెల 18న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గెజిటెడ్ నెంబర్ -1 ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని, ఆసక్తి గలవారు హాజరుకావాలని కోరారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ముందస్తు అరెస్టు


పోలీస్‌స్టేషన్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: హైదరాబాద్‌లోని డీఎంఈ ఎదుట మెడికల్ హెల్త్ రాష్ట్ర జేఏసీ మంగళవారం చేపట్టిన ధర్నాకు జిల్లా కేంద్రంలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు బండ శ్రీను మాట్లాడుతూ వేతనాలు పెండింగ్‌లో ఉంచడంతో ఉద్యోగులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. శాంతియుతంగా చేపట్టే ధర్నాకు తరలివెళ్లకుండా ప్రభుత్వం అరెస్టు చేయించడం సరికాదన్నారు. వెంటనే వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ఎస్పీకి సైబర్ బాధితుడి సన్మానం


ఎస్పీని సన్మానిస్తున్న బాధితుడు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిక్షా కాలనీకి చెందిన రాథోడ్ సునీల్ గత సోమవారం గ్రీవెన్స్‌లో ఎస్పీని కలిసి తన అకౌంట్‌లోకి రావాల్సిన రూ.41,800 డబ్బులు వేరే అకౌంట్‌లోకి వెళ్లాయని ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ కడప సైబర్ బృందాన్ని సంప్రదించి ఆ డబ్బులు తిరిగి బాధితుడి అకౌంట్‌లోకి వచ్చేలా చేశారు. బాధితుడు సునీల్ మంగళవారం ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్‌క్రైమ్ ఆర్ ఎస్సై గోపికృష్ణ, సిబ్బంది రియాజ్, త్రిశూల్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి


డీఐఈవోకు వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న నీట్, ఐఐటీ, ఇతర కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రాకేష్ మంగళవారం డీఐఈవో జాదవ్ గణేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షల ఫీజులు వసూలు చేస్తూ వ్యాపారం కొనసాగిస్తున్నారన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఆర్టీఎఫ్ డబ్బులను కళాశాల యాజమాన్యాలు అడగడం మానుకోవాలన్నారు. ఆయన వెంట అరుణ్, గౌతమ్, తదితరులు ఉన్నారు.

బోథ్‌లో భారీ వర్షం


మర్లపెల్లిలో కూలిన ఇంటి గోడ

బోథ్: మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మర్లపెల్లిలో పడిగెల రాములుకు చెందిన ఇంటి గోడ కూలింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మండల కేంద్రంలో ఓ ట్రాన్స్‌ఫార్మర్ గద్దెపై నుంచి కిందపడిపోయింది. సాయినగర్ కాలనీలో వర్షపునీరు ఇళ్లలోకి చేరడంతో కాలనీవాసులు ఇబ్బంది పడ్డారు.

18న నెట్‌బాల్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సన్‌షైన్ పాఠశాలలో ఈ నెల 18న జూనియర్ బాలబాలికలకు, సీనియర్ మహిళ, పురుషులకు నెట్‌బాల్ జిల్లాస్థాయి జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేశ్, ప్రధాన కార్యదర్శి గౌతమ్ తెలిపారు. మంగళవారం విలేకరులతో వారు మాట్లాడుతూ ఆసక్తి గల క్రీడాకారులు గురువారం ఉదయం 11 గంటలకు ఆధార్‌కార్డు, మూడు పాస్ ఫొటోలతో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌కు రిపోర్ట్ చేయాలని, మరిన్ని వివరాలకు 9490002161 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బ్యాగుల పంపిణీ


బ్యాగులు అందిస్తున్న మౌనిష్‌రెడ్డి

బేల: మండలంలోని మాంగ్రుడ్ గిరిజన సంక్షేమ ప్రాథమిక, మండల పరిషత్ ప్రాథమిక (మరాఠీ మీడియం) పాఠశాలల్లో మంగళవారం సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి 80మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. గ్రామస్తులు ఠాక్రే మంగేష్, టేకాం నేతాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం విద్యావాహిని, ఏకలవ్య ఫౌండేషన్ల ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేశారు. పద్యాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సంతోష్, దిగంబర్, సాశీల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పరామర్శ

నేరడిగొండ: లఖంపూర్ ఉపాధ్యాయుడు మడావి బాపురావు తల్లి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల గిరిజన ఉపాధ్యాయులు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ టీజీ జిల్లా అధ్యక్షుడు ఆడే నూర్ సింగ్, జ్యోతిరామ్, విఠల్, చంద్రశేఖర్, భీముడు, వినోద్, శ్రీనివాస్, తుకారాం, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతలో హిందీ కీలకపాత్ర


పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎంపీ నగేష్

కైలాస్‌నగర్: స్వాతంత్య్ర ఉద్యమంలో దేశాన్ని ఏకతాటిపై తీసుకొచ్చి జాతీయ సమైక్యతకు తోడ్పడటంలో హిందీభాష కీలకపాత్ర పోషించిందని ఎంపీ గోడం నగేష్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన హిందీ భాష దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సద్గురు పూలాజీ బాబా బోధనలపై సుకుమార్ పెట్కులే రాసిన 108 దోహేలతో హిందీ తెలుగు భాషల్లో ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్రస్థాయిలో అవార్డు అందుకున్న హిందీ లెక్చరర్ సురేష్ సింగ్, జిల్లా, మండల స్థాయిలో అవార్డులు అందుకున్న తొమ్మిది మంది హిందీ పండిత్‌లను, డీఆర్‌పీలను సత్కరించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ చిట్యాల సుహాసినిరెడ్డి, హిందీ డెయిలీ పత్రిక సంపాదకులు బి.సందేశ్, ప్రముఖ సాహితీవేత్త మధుబావల్కర్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

హిందీ భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా సుకుమార్ పెట్కులే మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా దత్తాత్రేయ ద్రోణాలేతో పాటు 21 మంది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో రాణించాలి


ఖోఖో క్రీడాకారులతో ఎంఈవో, పీడీ

తలమడుగు: ఖోఖో క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆర్గనైజింగ్ సెక్రటరీ రామేశ్వర్, ఎంఈవో వెంకట్‌రావు, జిల్లా క్రీడల అధికారి పార్థసారథి అన్నారు. మంగళవారం తలమడుగు మండలంలోని దేవపూర్ జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఎస్జీఎఫ్ అండర్ 14, 17 జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో రాణించిన విద్యార్థులు జోనల్‌స్థాయి, అందులో ఎంపికైన వారికి రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నర్సయ్య, పీడీలు ధమశ్రీ, సాయికుమార్, కాంతారావు, ఉపాధ్యాయులు దిలీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న సీడీపీవో శారద

నార్నూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లలోపు చిన్నారుల విద్య, సంరక్షణ, పోషకాహార నాణ్యతను మెరుగుపర్చడమే లక్ష్యంగా మూడురోజులపాటు నిర్వహిస్తున్న పోషణ్ భీ-పడాయి భీ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో శారద అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్ల సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్ కుమార్, సూపర్‌వైజర్లు ఉమ, ప్రదీప్తి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటం నేటితరానికి ఆదర్శం


నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

తాంసి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శమని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.విలాస్ అన్నారు. మంగళవారం మండలంలోని సావర్గాంతో పాటు గోట్కూరి గ్రామాల్లో సాయుధ పోరాట వార్షికోత్సవ సభలను నిర్వహించారు. పార్టీ కార్యాలయాల వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ వైఖరిని తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిలుక దేవిదాస్, మేస్రం భాస్కర్, కేశవ్, రాజు, అరుణ్ కుమార్, సత్యాజీ, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు


మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌మోహన్

తలమడుగు: ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ రాజ్‌మోహన్ అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల వారీగా జీపీవోలను నియమించింది. తలమడుగు మండలానికి కొత్తగా విధుల్లో చేరిన జీపీవోలను మంగళవారం ఆయా గ్రామాలకు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ముఖ్యంగా స్థానికంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు అశోక్, రోహిదాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


సన్మాన గ్రహీతలతో ఎంఈవో భూమారెడ్డి

నేరడిగొండ: ఉపాధ్యాయుల కృషి, అంకితభావంతో విద్యార్థులకు మంచి భవిష్యత్ అందుతుందని ఎంఈవో భూమారెడ్డి అన్నారు. మండల స్థాయి ఉత్తమ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జ్యోతి, నజీబ్, శారద, ఖ మ్రుద్దీన్, అశ్విని, రాజ్‌కుమార్, స్వర్ణలత, శివలీల, గుణవంతరావు, శ్రీరామ్, స్నేహ, అనిల్, సురేందర్, వినోద్, రవి, దశరథ్‌కు అవార్డులు ప్రదానం చేశారు. శ్రీనివాస్ గౌడ్, నూర్‌సింగ్, గంగాధర్, రాజ్‌కుమార్, అంబా రావ్, బిక్కులాల్, తానాజీ, సుభాష్ పాల్గొన్నారు.

నేరడిగొండ: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న తేజాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు సంతోష్ కుమార్‌ను మంగళవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు మణిలత, ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు పవన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

టెంట్ పిచింగ్‌పై శిక్షణ

ఆదిలాబాద్: టెంట్ పిచింగ్‌తో జట్టు భావన అలవడుతుందని ఎన్‌సీసీ 32టీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వీపీ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో ఎన్‌సీసీ 3వ వార్షిక శిక్షణ శిబిరంలో మంగళవారం క్యాడెట్లకు టెంట్ పిచింగ్‌పై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాడెట్లంతా ఐకమత్యంగా ఉంటేనే శిక్షణ విజయవంతం అవుతుందన్నారు. లెఫ్టినెంట్ గాలి అశోక్, పుట్ట లక్ష్మణ్, బెల్లం భూమన్న, రజిత, మధు రావు, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పంటనష్ట పరిహారం ఇవ్వాలి

జైనథ్: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలని మండల కేంద్రానికి చెందిన రైతులు మంగళవారం తహసీల్దార్ ఆత్రం నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పుండ్రు అశోక్‌రెడ్డి, అనిల్, సామ వెంకట్‌రెడ్డి, పెద్ద లక్ష్మన్న యాదవ్, దయాకర్, రవీందర్‌రెడ్డి, సామ అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

పుస్తకరచన అభినందనీయం

ఉట్నూర్‌రూరల్: డిగ్రీ మొదటి సంవత్సరంలో మారిన రసాయన శాస్త్రం సిలబస్‌కు అనుగుణంగా బీఎస్సీ మొదటి సంవత్సరం పుస్తకాన్ని డాక్టర్ గేడం సాయి ప్రసాద్ రచించడం అభినందనీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్ అన్నారు. మంగళవారం వైస్ ప్రిన్సిపాల్ సాయిప్రసాద్‌ను కళాశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ నర్సింగ్ రావు, డాక్టర్ రాణి, ముజీబ్, డాక్టర్ రవీందర్, రాజశేఖర్, డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.